క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల బాధితులను ఆదుకుంటాం

పెద్దాపురం: స్థానిక రామారావుపేటలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. మంగళవారం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజుతో కలిసి అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడుతూ ప్రమద బాధితులకు సొంత ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు గృహ నిర్మాణం మంజూరు చేసి అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తూతిక రాజు, శాస్త్రి, కందుల కుమార్, బొడ్డు ఉదయ్ తదితరులున్నారు.

17న రక్తదాన శిబిరం

సామర్లకోట: స్థానిక గాంధీచౌక్ వద్ద ఉన్న రైతు భవనంలో 17వ తేదీన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో అనేక మంది తలసేమియా బాధితులు ఉండటం వల్ల వారికి తరుచూ రక్తం ఎక్కింవలసి ఉండటంతో రక్తం నిల్వలు పెంచాల్సి ఉందన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ప్రతి గ్రామంలోను పట్టణంలోను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు గ్రామ ప్రజలలో అవగాహన పెంచాల్సి ఉందన్నారు. ఈ శిబిరంలో ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, వ్యాపారులు పాల్గొన్ని రక్తదానం చేయాలని తహసీల్దార్ పిలుపు నిచ్చారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కరప: స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అంజు ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పరిసర గ్రామాల వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరప: స్వయం ఉపాధి కల్పించుకోవడానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయనున్నామని, దీనికి సంబంధించిన వెబ్‌సైట్ ప్రారంభమైందని, అర్హులు మే నెల పదో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.అనుపమ కోరారు. కరపలో మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. లబ్ధిదారుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారై, కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారై ఉండి, వయోపరిమితి 21 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. స్వయం ఉపాధి పథకాలలో రవాణారంగం కోసం అయితే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. జనరిక్ ఫార్మసీ రంగానికైతే డి.ఫార్మసీ లేదా బి.ఫార్మసీ లేదా ఎం.ఫార్మసీ ఉండాలన్నారు. ఆధార్ కార్డ్, ఈ కార్డ్‌తో లింక్ అయిన ఫోన్‌నెంబర్, రేషన్‌కార్డు, సంబంధిత అర్హతకలిగిన సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అనుపమ కోరారు.

కళలతో సామాజిక బంధాలు బలోపేతం

కాకినాడ రూరల్: సమాజం మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, కళాత్మక వ్యక్తీకరణల వైవిధ్యం గురించి అవగాహన కల్పించడానికి కళలు దోహదపడతాయని చిత్రకళలో జాతీయ పురస్కారాన్ని అందుకున్న మంచం సుబ్రహ్మణ్యేశ్వర రావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో అత్యంత ప్రసిద్ధ కళాకారులలో ఒకరైన లియోనార్డో డావిన్సీ జయంతిని ప్రపంచ కళా దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఒక చిత్రం వెయ్యి ఆలోచనలు, భావాలకు సమానమైనదన్నారు. తాను ఎక్కువగా సంప్రదాయ చిత్రాలు చిత్రించానని అన్నారు. తన చిత్రాలకు జాతీయస్థాయిలో కాకుండా రాష్ట్రస్థాయిలో వివిధ పరిషత్‌ల ద్వారా అనేక పురస్కారాలను అందుకున్నట్లు సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. అనంతరం అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అద్దాల సత్యనారాయణ, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీపై కేసు

కాకినాడ క్రైం: తన ఇంట్లో బంగారం చోరీకి గురైందంటూ ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే కాకినాడ డైరీఫారం కూడలి రాజీవ్‌గృహకల్పకు చెందిన దూలిపూడి రమేష్ అనే వ్యక్తి తన ఇంటి తలుపు తాళం బద్దలు కొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలో ఉన్న సుమారు నాలుగు గ్రాముల బరువున్న బంగారు సూత్రాలు ఎత్తుకెళ్లారని మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 12వ తేదీన తాను భార్యతో కలిసి ఊరు వెళ్లి 13వ తేదీన వచ్చే సరికి ఇంటి తాళం పగిలిపోయి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు కాకినాడ పోర్టు పోలీసులు తెలిపారు.

వేట లేక సాపాట్లు!

- మత్స్యకారులకు అందని ప్రభుత్వ సాయం
- నిషేధాజ్ఞలతో తీరానికి చేరిన బోట్లు
- నిర్మానుష్యంగా మారిన ఉప్పాడ తీరం
- వలల మరమ్మతుల్లో మత్స్యకారులు



రామన్నపాలెం ఉప్పుటేరు వద్దకు చేరుకున్న బోట్లు

కొత్తపల్లి: చేపల వేట నిషేధంతో తీర ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. మండల పరిధిలోని మత్స్యకార గ్రామాల్లో సుమారు ఆరు వేల కుటుంబాలు, సుమారు 1265 బోట్లు ఉన్నాయి. మత్స్యకారులు చేపల వేటే ఆధారంగా జీవిస్తారు. మండలంలో ఉప్పాడ, సుబ్బంపేట, మాయాపట్నం, సూరాడపేట, అమినాబాద్, పొన్నాడ, మూలపేట, కోనపాపపేట తదితర గ్రామాల్లో మత్స్యకార కుటుంబాలు చేపల వేట సాగిస్తుంటారు. వలలు పట్టుకుని ఒక సారి సముద్రంపైకి వెళ్లారంటే రోజులు, వారాల తరబడి ఇంటి ముఖం చూడని పరిస్థితి వారిది. సముద్రుడు కరుణిస్తే వందల కిలో మీటర్లు వెళ్లి వేట సాగించి మత్స్య సంపదతో ఇంటికి తిరిగి వస్తారు. సముద్రంలో మత్స్య సంపద అభివృద్ధి చెందే సమయం కావడంతో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్15 అర్ధ రాత్రి వరకూ ప్రభుత్వం చేపల వేటను 61 రోజుల పాటు నిషేధిస్తుంది. ఈ సమయంలో ఎవరైనా వేటకు వెళితే కేసులు పెడతామని హెచ్చరికలు జారీ చేస్తారు. తీరం వెంట మత్స్యశాఖ, మెరైన్, నేవి అధికారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా కట్టిదిట్టమైన పహారా కాస్తారు. దీంతో ఎక్కడికక్కడ చేపల వేట నిలిచిపోయింది. గతంలో అక్కడక్కడా చేపల వేట కొనసాగించినా ఈ ఏడాది కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవడంతో ఎక్కడా వేట జరుగుతున్నా దాఖలాలే కనిపించడంలేదు. ప్రస్తుతం మత్స్యకారులు వలలను ఒడ్డుకు చేర్చుకుని మరమ్మతులు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. చేపల విక్రయాలతో ఉప్పాడ తీర ప్రాంతం కళకళలాడుతూ ఉండేది. వేట నిషేధించడంతో సాగర తీరం మూగబోయింది. బోట్లు లంగర్లు వేయడంతో చిన్నచిన్న తెప్పలు మాత్రమే సముద్రంలోనే వేట సాగిస్తూ కనిపిస్తున్నాయి. ప్రతి నిత్యం చేపల ఎగుమతులతో కళకళలాడే ఉప్పాడ, అమీనాబాదు తీరప్రాంతం బోసి పోయింది.

మండలంలో మత్స్యకార భరోసా పొందినవారి వివరాలు ఇలా..

సంవత్సరం	మత్స్యకారులు
2019–20	4426
2020–21	4611
2021–22	5327
2022–23	5285

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా:

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసాతో ఎంతో ఆదుకున్నారు. నాలుగేళ్లపాటు వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికి రూ.10 వేలు చొప్పున బ్యాంకు ఖాతాలకు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. భరోసా కోసం మత్స్యకారులు ఎదురుస్తున్నారు.

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసాతో మా కుటుంబాలను అన్ని విధాలా ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మా మత్స్యకారులను పట్టించుకోవటం లేదు. చేపట వేట జీవనాధారంగా బతుకుతున్నాం.

– ఎరుపల్లి కుమార్, ఉప్పాడ

గత ప్రభుత్వంలో భరోసా



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన మత్స్యకార భరోసాను వేట నిషేధ సమయంలోనే అందించారు. అవినీతికి తావు లేకుండా మా బ్యాంకు ఖాతాల్లోకి సొమ్మును జమ చేశారు. ఈ కూటమి ప్రభుత్వంలో భరోసా కోసం ఎదురుచూడాల్సి వస్తుంది.

– ఓసిపల్లి జగన్నాథం, ఉప్పాడ

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

వేట నిషేధ సమయంలో ఏ ఒక్క మత్స్యకారుడు చేపల వేటకు వెళ్లకూడదు. సాంప్రదాయ బోట్లతో వేట సాగించుకోవచ్చు. వేట నిషధంపై మత్స్యకారులకు అవగాహన కల్పించడంతో పాటు మత్స్యకార గ్రామాల్లో ప్రచారం చేసి అవగాహన కల్పించాం.

– శ్రీరామకృష్ణ , మత్స్యశాఖ అధికారి

ముస్లిం జేఏసీ కన్వీనర్‌గా ముక్తార్ ఆలీ



జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న ముక్తార్ ఆలీ

పెద్దాపురం: పట్టణ ముస్లిం జేఏసీ కన్వీనర్‌గా మహ్మద్ ముక్తార్ ఆలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక షామీ జామియా మసీద్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో పట్టణ ముస్లింలు ఆయనను కన్వీనర్‌గా ఎన్నుకుంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ముక్తార్ ఆలీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు అమలు నేపథ్యంలో భవిష్యత్ కార్యచరణ, ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో పాటు వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం సమాజానికి కలిగే నష్టాలపై మసీదుల్లో అవగాహన కల్పించేందుకు జేఏసీ పని చేస్తుందన్నారు. అనంతరం వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చేస్తున్న జేఏసీ ఆందోళనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే చిన రాజప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్తాఫా, ఆషిక్ ఆలీ, నవాబ్ జానీ, షేక్ గౌస్, ఎంఎల్ ఆలీ, అబ్దుల్ రజాక్, మక్బుల్ జానీ తదితరులతో పాటు మూడు మసీద్‌ల ఇమామ్‌లు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని అరెస్టు చేయాలి

కౌన్సిలర్ నేతల హరిబాబు



నేతల హరిబాబు

సామర్లకోట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ చెప్పుల దండ వేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. ప్రతిపాడు నియోజకవర్గం శంఖవరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేసి రాజ్యాంగ నిర్మాతను అవమానించడాన్ని వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నిందితులు ఎంతటి వారైనా అరెస్టు చేయాలని హరిబాబు డిమాండ్ చేశారు. కులమతాలకు అతీతంగా సమ సమాజ స్థాపనకు కృషి చేసిన అంబేడ్కర్‌ను అవమానించడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ ఘటనపై విచారణకు వైఎస్సార్ సీపీ పూర్తి సహకారం ఉంటుందన్నారు.

ఏ పార్టీ వారైనా కఠినంగా శిక్షించాలి

శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి వారు ఏ పార్టీకి చెందిన వారైనా కఠినంగా శిక్షించాలని జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి పిట్టా జానకి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఇటువంటి సంఘటన లు జరుగ కుండా ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో..

పిఠాపురం: శంఖవరం దళితపేటలోని అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన సంఘటనపై కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సురేష్ కుమార్, కె.సింహాచలం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యేక చట్టం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మొదటి ఫలితమే అదిరేలా!

- కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన బాలికోన్నత పాఠశాల
- ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాల సాధన
- జిల్లాలో ద్వితీయ స్థానం కైవసం
- విద్యార్థులను అభినందించిన అధ్యాపకులు
- ప్రోత్సాహకంగా నగదు బహుమతులు అందజేత



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

సామర్లకోట: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను బాలికల జూనియర్ కళాశాలగా గుర్తించిన మొదటి సంవత్సరంలోనే ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ యు.మీనా మాధురి అన్నారు. ఈ మేరకు కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం ఆమె అభినందించారు. జిల్లా పరిషత్తు జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మీనా మాధురి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సామర్లకోట జిల్లా పరిషత్తు బాలికల జూనియర్ కళాశాల 70 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో ఉండడం ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. బైపీసీలో నూతలపాటి శ్రీమాన్విత వెయ్యి మార్కులకు 848 మార్కులతో ప్రథమ స్థానం, సీహెచ్ శ్వేత 843 మార్కులతో ద్వితీయ స్థానం, టి.హరివర్షి పూజ 800 మార్కులతో తృతీయ స్థానం సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపీసీలో బత్తుల ఝాన్సీ 779 మార్కులతో ప్రథమ, జావ్వాదుల అర్చన 692 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారని ఆమె తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.రెండు వేలు, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందజేసి అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ ఇంగ్లిషు, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టు టీచర్లు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ పి.భవాని, వైస్ చైర్మన్ పచ్చాకుల లోవరాజు పాల్గొని విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయడంపై అభినందించారు.

మంచి పేరు కోసం ప్రయత్నం



కొత్త కళాశాల కావడంతో కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని ప్రయత్నించాం. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కష్టపడి మంచి పేరు తీసుకు వస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకున్నారు. హైస్కూల్‌లోని 17 మంది ఉపాధ్యాయులతో పాటు అదనంగా మరో ఏడుగురిని జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి ఇక్కడికి బదిలీ చేశారు. వారి అనుభవాన్ని రంగరించి విద్యార్థులకు బోధన, దానికి తగ్గట్టే విద్యార్థులు సైతం క్రమశిక్షణతో చదవడంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయి. కళాశాల కొత్తగా ఏర్పాటు చేయడం వల్ల ల్యాబ్ లేక పోవడంతో సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసుకునే వారు. కొత్త కళాశాల కావడం వలన ఎంపీసీ, బైపీసీలలో బోధన ఎలా ఉంటుందో ననే సంశయంతో చాలా మంది కళాశాలలో చేరలేదు. తాజా ఫలితాలతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. విద్యార్థులకు ఉదయం, సాయంత్ర అదనపు క్లాసులు నిర్వహించడం జరిగేంది. విద్యార్థులను ప్రోత్సహించడానికి ఉత్తీర్ణులైన వారికి నగదు పారితోషకం నిచ్చాం. వచ్చే విద్యా సంవత్సరంలో దాతల సహకారంతో మరింత ప్రోత్సాహకాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– యు.మీనామాధురి, ప్రిన్సిపాల్, జెడ్పీ జూనియర్ హైస్కూల్, సామర్లకోట

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీఐ శ్రీనివాస్



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పిఠాపురం: వాహన చోదకులు రహదారి నిబంధనలు పాటించాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన పిఠాపురం పాదగయ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ప్రతి వామన చోదకుడు దగ్గర ఉంచుకోవలసిన డ్రైవింగ్ లైసెన్సు, బీమా కాగితాల గురించి, ప్రస్తుత చట్టాలపై అవగాహన కల్పించారు. అధిక వేగంగాను, మద్యం తాగి డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్‌లో మాట్లాడడం వంటి వాటి వల్ల జరిగే అనర్థాలు గురించి వివరించారు. రహదారి ప్రమాదంలో పొరపాటున వాహనం నడిపే వ్యక్తి లేదా ఎదుటి వ్యక్తికి గాని నష్టం జరిగినా, లేదా ప్రాణాలు పోయిన వారితో పాటు వారి కుటుంబ సభ్యుల జీవితాల్లో కూడా ఆర్థికంగానూ మానసికంగా ఇబ్బందులు కలుగుతాయన్న విషయాన్ని అందరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్, రెస్క్యూ పరికరాల ప్రదర్శన

కాకినాడ రూరల్: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఓఎన్‌జీసీ కాకినాడ ప్రధాన కార్యాలయంలో అగ్నిమాపక, విపత్తు సమయంలో చురుగ్గా వ్యవహరించేందుకు ఉపయోగపడే అత్యాధునిక ఫైర్, రెస్క్యూ పరికరాల ప్రదర్శన నిర్వహించారు. ప్రజలకు, పనిచేసే సిబ్బందికి అత్యాధునిక ఫైర్, రెస్క్యూ పరికరాల ప్రదర్శనశాలను ఓఎన్‌జీసీ సంస్థ ఈడీ రత్నేష్ కుమార్, ఎస్ఎం ఈడీ ప్రబాల్ సేన, ఫైర్ సర్వీస్ ఇన్‌చార్జి అధికారి విజయ్ కాల ఆధ్వర్యంలో దీనిని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కాకినాడ జేఎన్‌టీయూకే, జోయల్‌మెడోస్, వాకలపూడి జెడ్పీహెచ్ స్కూళ్లలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఓఎన్‌జీసీ సంస్థ అయిన ఓజీటీ మల్లవరం, ఓటీటీ ఓడలరేవు ఓఎన్‌టీసీ, ఆఫ్ షోర్‌లలో కార్యక్రమాలు జరగనున్నాయి. ఓఎన్‌జీసీ ఫైర్ ఇన్‌చార్జిలు సక్సేనా శర్మ, అభిషేక్ చౌదరి, జీఎస్ భాస్కర్, కె.లక్ష్మణ్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

తృణ ధాన్యాలతో మహిళలకు మేలు



తల్లులకు అవగాహన కల్పిస్తున్న మానస

పిఠాపురం: ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పోషణ పక్వాడా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానస అన్నారు. కార్యక్రమంలో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆరో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తృణ ధాన్యాలపై గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. తృణధాన్యాలలో పోషకాలు, ఏయే విలువలు ఉంటాయి, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి, వాటిని ఎలా తీసుకోవాలి అనే విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా పాలిచ్చే తల్లులు గర్భవతులు కూడా ఈ తృణధాన్యాలు తీసుకోవడం ద్వారా పాల ఉత్పత్తి బాగా ఉంటుందన్నారు. అండాశయ క్యాన్సర్ వంటివి రాకుండా ఉంటాయని, పిల్లల్లో ఊబకాయం సంబంధించి సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని అందువల్ల అందరూ తృణ ధాన్యాలను తీసుకునే విధంగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు ఆరోగ్యవంతమైన సంతానాన్ని పొందాలన్నారు. పిల్లల భవిష్యత్తు బంగారు బాట వేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన అవసరం



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న హరిబాబును సత్కరిస్తున్న అధికారులు, గ్రామస్తులు

కరప: రసాయనిక ఎరువులు, మందులు వినియోగించకుండా ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తులు సాధించేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు సూచించారు. మండలం వాకాడలో మంగళవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది సంయుక్తంగా ప్రచారం చేసి, ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. రబీ కోతలకు ముందు పీఎండీఎస్ (ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్) విత్తనాలు చల్లడం వల్ల నేల సారవంతం అవుతుందన్నారు. వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీతో వేసవి అపరాలు మినుము, పెసర, పిల్లిపెసర, జనుము, జీలిగ సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందడంతో పాటు, భూసారం వృద్ధి చెందుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎంటీ ధనలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీఎండీఎస్ కిట్లను ఏడీఏ బాబూరావు రైతులకు అందజేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు దూడల వీరాస్వామి, లకమన హరిబాబులను గ్రామస్తులతో కలసి ఏడీఏ సత్కరించారు. మాజీ సర్పంచ్ పెంకే సోమరాజు, మాజీ ఉపసర్పంచ్ దూడల నారాయుడు, సురేష్, వీఏఏ బి.అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో వనవిద్య

- వేసవి నేపథ్యంలో పచ్చని చెట్ల నడుమ విద్యాబోధన
- పర్యావరణ పరిరక్షణలో జేఎన్‌టీయూకే
- హరిత విప్లవానికి ప్రత్యేక కమిటీ



జంగిల్‌బుక్ పేరుతో చెట్ల కింద తరగతులు బోధిస్తున్న దృశ్యం



గ్రంథాలయం పక్కన ఏర్పాటు చేసిన మియావాకీ ప్లాంటేషన్

బాలాజీచెరువు: అసలే వేసవికాలం. అపై విద్యుత్ కోతలతో ఉక్క పోతలో తరగతుల నిర్వహణ. ఉష్.. ఉష్ అనుకుంటూ చెమటలు తుడుచుకుంటూ విద్యార్థులు.. ఈ పరిస్థితుల్లో బోధన, పాఠ్యాంశాలు నేర్చుకోవడం అంటే కష్టమే మరి. ప్రాథమిక పాఠశాల, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అయితే దాదాపు 50 రోజుల వరకూ సెలవులు ఉంటాయి. ఇంజినీరింగ్ విద్యార్థులకు మాత్రం సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో వేసవి కాలం మొత్తం తరగతులు ఉంటాయి. ఇంజినీరింగ్‌లో పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి చేసిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ఆచరించేలా కృషి చేస్తున్నారు జేఎన్‌టీయూ అధికారులు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని భావించి వాటికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. నగర నడిమధ్యలో ఉన్న జేఎన్‌టీయూకే దాదాపు 70 ఏకరాలు పైబడి ఉండగా అందులో సగం వరకూ ఖాళీ స్థలం ఉంది. ఈ ప్రాంతాలలో మొక్కలు నాటి పచ్చని వాతావరణం కల్పించాచారు. రహదారికి ఇరువైపులా మొక్కలతో పాటు ఖాళీ ప్రాంతాల్లో వివిధ జాతులకు చెందిన మొక్కలను నాటడానికి చర్యలు తీసుకుంటున్నారు. రేండేళ్ల క్రితం జేఎన్‌టీయూకే గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌లో అవుట్‌స్టాండింగ్ పెర్ఫార్మెన్స్ సర్టిఫికెట్ సాధించింది. గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌కు సంబంధించి 2021–22కు గాను ఆడిటింగ్‌లో గ్రీన్ క్యాంపస్ ఎకోస్కోర్ 53 శాతం పొందింది. దాని పెరుగుదలకు అధికారులు మరింత కృషిచేస్తున్నారు. ఎనర్జీ సీవరేజ్ (వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్) కార్బన్ క్రెడిట్స్ (కార్బన్ ఉద్గారాలు) గ్రీన్ బిల్డింగ్, ఇ–వేస్ట్ మేనేజ్‌మెంట్, టెర్రస్ ఫార్మింగ్, కంపోస్టింగ్ వంటి అంశాలు పరిగణలోకి తీసుకుని స్కోర్ విడుదల చేశారు. నేషనల్ అక్రెడిటేషన్ బోర్డు లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వం సహకారంతో సర్వే చేసి ర్యాంక్ విడుదల చేస్తారు.

మియావాకీ ప్లాంటేషన్

జపాన్‌కు చెందిన వ్యక్తి రూపొందించిన మియావాకీ (మినీ ఫారెస్ట్)ప్లాంటేషన్ జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేశారు. ప్రధాన గ్రంథాలయం పక్కన 2020 సంవత్సరంలో 2020 మొక్కలతో అర ఎకరం పైగా అన్ని రకాల మొక్కలు నాటి దాన్ని మినీ ఫారెస్ట్‌గా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత మంతా ఎంత ఉష్ణోగ్రత ఉన్నా ఈ ఫారెస్ట్ కాస్త వరకూ ఉపశమనం కలిగిస్తుంది.

జంగిల్ బుక్

పూర్వపు గురుకుల పాఠశాల తరహాలో డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ బిల్డింగ్ వద్ద జంగిల్‌బుక్ పేరుతో వృక్షాల మధ్య విద్యార్థులకు తరగతులు బోధించే విధంగా ఏర్పాటు చేశారు. పచ్చని వాతావరణం మధ్య చెట్ల బల్లలపై కూర్చుని పాఠాలు వినేలా రూపొందించారు.